

# అమెరికా అమ్మాయి

## – శ్రీనిధి యెల్లల



### నలుగురు కూర్చుని నవ్వేవేళన
### నాపేరొక పరి తలవండీ !!

**ఎటు చూసినా** దారికి అటు ఇటు చెర్రీ పూలతో నిండుగా ఉన్న చెట్లు. పూల పల్లకీ ఎక్కి రాబోయే వసంత ఋతువుకి స్వాగతం చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉన్నాయి. ఎంత సేపు చూసినా తనివి తీరని అందం. చెట్ల కొమ్మలకి పీచుమిఠాయి పువ్వులు పూసినట్టు ఒకసారి, గాలికి వెళ్లే మేఘమాల చెట్ల కొమ్మల్లో చిక్కుకున్నట్లు ఇంకోసారి. కిటికీలోంచి కనపడే ఆ చెర్రీ పూల అందాలని ఎంతసేపటినుండి చూస్తున్నానో మరి. ఎన్నో రోజులు ఉండవు ఈ సుకుమారాలు. ఆలోపు కళ్ళతో దోసిలి పట్టి తాగెయ్యాలి.

నా ఈ ప్రపంచానికి సరిగ్గా అవతలి వైపు మా పిన్ని కూతురు చింటూ పెళ్లి. నా మనసంతా అక్కడే ఉంది. ఫోన్లలో వాట్స్ ఆప్లలో అన్ని విశేషాలు కనుక్కుంటున్నా తీరని ఆరాటం. మరీ అర్ధరాత్రీ అపరాత్రి అని చూడకుండా ఫోన్లు చేస్తూ విసిగిస్తున్నానని అంతా జేరి బతిమాలుకున్నారు...పెళ్ళికి ముందు రెండు రోజులు కాల్ చెయ్యొద్దని. కావాలంటే వీడియో కాల్ ఆన్ చేసి వంతులు వేసుకుని కవర్ చేసి అంతా చూపిస్తామని. సరే లెమ్మని ఊరుకున్నా. అట్లా పెళ్లి లడ్డూలు చుట్టేటప్పుడు ఎదురుగా ఒక ఫోన్ లో నన్ను కూడా పెట్టుకుని చక్కగా పెద్దమ్మలు పిన్నీవాళ్ళు కలిసి లడ్డుండలు చుట్టేశారు. పెళ్లి పిలుపులు టిక్ టాక్ లో వీడియో తీసి పెడదామని, పెట్టుడు చీరలకు వెంకటగిరి అయితే శ్రేష్ఠమనీ, పెళ్లికూతురి బట్టల కోసం వెళ్లివచ్చిన కంచి ప్రయాణం గురించీ, తరతరాలుగా మారుతున్న నగల తీరుతెన్నుల గురించీ ఎడతెరగని కబుర్లు. వెధవ టైం డిఫరెన్స్ వల్ల నిద్రముంచుకొచ్చేసి వాళ్ళ కబుర్లు వింటూనే పడుకుండిపోయా.

తర్వాత రోజు పెళ్లికూతురుని చేసారు చింటూని. చిన్నంచు చీరలు, సరియంచు చీరలు, మూరెడేసి అంచున్న చీరలు కట్టుకుని అంతా అటు ఇటు తిరుగుతూ ఉంటే ఒక్క నిమిషం చిలకాకు పచ్చకి కుంకుమ రంగు అంచున్నపట్టు చీర కట్టుకుని వీడియో తెరలోంచి అటు వైపు దూకెయ్యాలనే ఆరాటాన్ని బలవంతాన అణచుకున్నాను. పూలు–పళ్లేలు అనీ, జాకెట్టు ముక్కలని, తాంబూలం లోకి తమలపాకులనీ హడావిడిగా అటు ఇటు తిరుగుతున్నట్టు, పెళ్లికూతురి జడ సరిచేస్తున్నట్టు, అందరు కలిసి నలుగు పెట్టేసరికి తన ముక్కుపై జారే కుంకుమని తుడుస్తున్నట్టు, పట్టు పావడాలు చుట్టుకుని బుట్టబొమ్మల్లా పెళ్లికూతురు చుట్టూ చేరిన తోడు పెళ్లికూతుర్లలో నా బుడ్డదాన్ని చూసి మురిసిపోతూ ఉన్నట్టు ఊహించుకుంటున్నానా...ఇంతలో పందిరి రాటకి కట్టిన ఫోన్ ముందు మూలయింటి పెద్దమ్మ వచ్చి కూర్చునేసింది. నన్ను మ్యూట్ లో పెట్టినట్టు ఉన్నారు నా ఘోష ఎవరికీ పట్టలేదు.

నాద్దైన ప్రపంచానికి నాకు మధ్యన పీఠం వేసుకుని కూర్చుంది పెద్దమ్మ. ఈవిడ ఒకపట్టాన కదలదు. అవతల డోలు సన్నాయి మేళాలు వినిపిస్తున్నాయి. మధ్య మధ్యలో చిలకలలాంటి అమ్మాయిల కిలకిలలు. ఫోటోగ్రాఫర్ సూచనలు. అమ్మా వాళ్ళ అరుపులు. వంటల వాళ్ళ

పురమాయింపులు. ఇవతల నాకేమో పెద్దమ్మ గద్వాల్ చీర అంచు తప్పించి ఏమీ కనపడడం లేదు. సరే ఎందుకులే విసిగించేది అని వీడియో ఆఫ్ చేసేసా. ఎలాగూ ఫంక్షన్ హాల్లో పెళ్లి అంతా ఆన్లైన్ స్ట్రీమింగ్ చేస్తారు కదా అని. తెల్లారి లేచి పెళ్లి లైవ్ టెలికాస్ట్ కి కనెక్ట్ అవుదాము అనుకున్నాను ఇక. ఆరుగంటలకు అలారం పెట్టుకుంటే చక్కగా రిసెప్షన్ నుండీ వక్కాకు శాస్త్రం, నలుగు, పెళ్లి అన్నీ చూడొచ్చు. అన్నీ అర్ధ రాత్రి ముహుర్తాలు పెడతారు, రాత్రి రెండూ, మూడు గంటల్లో పెళ్లిళ్లు ఏంటని విసుక్కుంటూ ఉండేదాన్ని. ఇప్పుడు ఆ సమయం నాకు కలిసి వచ్చింది.

పడుకుందామంటే ఒక పట్టాన నిద్రవస్తే కదా! రంగు రంగుల ఆలోచనలు. చిన్ననాటి నుండి చూసిన బంగారు పెళ్లి సంబరాలు. ఒక్కో ఋతువులో పూచే పువ్వులకు ఒక్కో అందం అన్నట్టు, ఎదిగేకొద్దీ చూసే పెళ్లిళ్లది కూడా ఒక్కో సారి ఒక్కో అందం ఒక్కో అనుభూతి మరి.

నే మొదట చూసిన పెళ్లి మా మేనమామ కూతురిది. ఐదేళ్ల పిల్లని నేను. పెళ్లికూతురు చిటికెన వేలుని పట్టుకుని భాజా భజంత్రీల నడుమ తోడు పెళ్ళికూతురిలా నడవడం ఒక్కటే గుర్తుంది నాకు. అమ్మ మొహం క్షణ కాలం కనపడకపోతే బెంగ పెట్టేసుకునే వయసు. ఆ హడావిడి, సందడి ఏదో తుఫాను లో చిక్కుకున్నట్టు అనిపించింది. అంతే అంతకు మించి ఏవీ గుర్తులేవు ఈ పెళ్లి గురించి. నిద్రపోయి లేచి "పెళ్ళేదమ్మా ?" అని అడిగానుట. ఆ పెళ్లి ఫొటోల్లో ఎక్కడా ఉండను నేను. ముహూర్తం ఫొటోలో పెళ్లికూతురు పక్కనే కూర్చున్న అమ్మ ఒడిలోంచి జారి ఉన్న మువ్వల పట్టీల చిన్ని పాదాలు . అదే నేను అని చెప్పింది అమ్మ .

తరువాత నే చూసిన పెళ్లి మా చినమామది. పదేళ్ల పిల్లని అప్పటికి. పువ్వులపైన పూల జడల పైనా, చీరలపైన అలంకారాలపైనా మోజు పెరుగుతున్న సమయం. పెళ్లికూతురంటే కంటి ముందు నిలిచిన దేవకన్యలా కనిపించేది అప్పుడు. పెళ్లికూతురుపైన చెప్పలేని ఆరాధనా భావం. పెళ్లి కూతురు చీర మురిపెం, ఆవిడ పాపిట కదిలే పాపిటిబిళ్ళ మురిపెం, నవ్వీ నవ్వక విచ్చుకుని ఉండే పెదవులు మురిపెం, ఘుమ్మని ఆమడ దూరం వరకు సువాసనలు వెదజల్లే ఆవిడ పూలజడ మురిపెం, పూల జడ బరువుకి తల సాంతం తిప్పలేక తాను ఓరగా చూసే చూపులు మురిపెం, గిలిగింతలు పెట్టేలా గలగలలాడే ఆవిడ చేతి గాజులు మురిపెం, పూటకో వర్ణంలో మెరిసే ఆవిడ చీరలు మురిపెం. ఇలా మొత్తంగా పెళ్లికూతురంటేనే ఆ వయసులో ఒక ఫాసినేషన్.

మండపంపైన పెళ్ళికొడుకు తరపు కాబట్టి మామయ్య పక్కనే కూర్చున్నాను కానీ చూపంతా అత్తమీదే. చెవులకు వేలాడే బుట్ట కమ్మలు, వాటి నుండి తీరుగా నాజూగ్గా వెనక్కి వెళ్లి జడలో కలిసే చెంపసరాలు, బుగ్గన ఉన్న చుక్క ఎంత బాగుందో అత్త. అందరూ అక్షింతలు జల్లుతుంటే నమస్కారం పెట్టి కంట్లో అక్షింతలు పడకుండా చికిలించి చూస్తూ నవ్వుతూ ఉన్న అత్త అలా మనసులో ముద్రపడిపోయింది. అన్నిటికన్నా ఆవిడ నవ్వు మరీ మరీ సమ్మోహనంగా అనిపించింది. పెళ్లికూతుళ్ళు మాత్రమే అలా నవ్వగలరేమో మరి. ఒక్క క్షణం వదలలేదు ఆవిడని నేను పెళ్లిలో. అట్లా మా చినమామ చిటికెన వేలు పట్టుకుని వచ్చిన చిన్నత్త అలాగే గుర్తుండిపోయింది నాకు ఇప్పటికీ. ఆ పెళ్లి ఫొటోల్లో నెమలికంఠం రంగుకి నీలం పట్టు హంసల బోర్డరూ, నీలం జాకెట్టు వేసుకుని, మెళ్ళో ఒంటిపేట గొలుసు వేసుకుని మామయ్య పక్కన నిలబడి ఒంగి అత్తనే చూస్తున్న నేను ఇంకా గుర్తే.

ఎన్నేసి సరదాలో పెళ్లిళ్లలో. కొత్త బంధుత్వాలతో కొత్త స్నేహాలు అయ్యేవి. పెళ్లి సంబరాలు ముగిసిన వారంలోనే ప్రాణ స్నేహితులం అయిపోయేవాళ్ళం. వచ్చే వేసవి సెలవుల్లో తప్పకుండా కలుసుకోవాలనే వాగ్దానాలు ఇచ్చిపుచ్చుకునేవాళ్ళం . అటు లోపల గదిలో అప్పటి దాకా కన్న కలలని పండించుకునే జంట అయితే... ఇటు మేమంతా మెద్ది మీద చెమ్కీ పొడి చల్లినట్టు ఉన్న ఆకాశం కింద వరసగా వేసిన పరుపులమీద పడుకుని చుక్కలు లెక్కపెట్టుకుంటూ అక్కావాళ్ళు చెప్పుకునే ముచ్చట్లు వింటూ కొత్త కలలు కనడం మొదలుపెట్టేవాళ్ళం.

తరువాత నే చూసిన పెళ్లి మా బావది. పద్నాలుగేళ్లు నాకు అప్పుడు. ప్రపంచానికి నేను కనిపించకుండా ఎక్కడైనా దాక్కుంటే బాగుండు అని అనుకునే వయసు. అటు చిన్నదాన్ని కానూ ఇటు పెద్దదాన్నీ కాదూ. ఎదిగీ ఎదగని వయసు. సమాధానం తెలియని లక్షాతొంబై

ప్రశ్నలు. గొంగళి పురుగు దశ. అన్నిటికీ అందరితో పోల్చి చూసుకోడం, ఏదో తక్కువయిందని కుమిలిపోడం. మనం తప్ప అందరూ బాగున్నారనే భావన. పట్టు చీరల నాణ్యతను బట్టీ మారే పలకరింపులు ఆశ్చర్యపరిచేవి. పెళ్లికూతురు నాన్న ఎందుకు కంగారు కంగారుగా ఉంటాడో అర్థమయ్యేది. ప్రపంచాన్ని నడిపే డబ్బు గురించి, బంధుత్వాలని శాసించే సంఘంలోని పరపతుల గురించి నిక్కచ్చిగా సూటిగా తెలుసుకునే సమయం. ఆ చేదు నిజాలు తెలియడం వల్ల వచ్చే కచ్చితనం. అంతదాకా గోలు గోలున మాట్లాడే దాన్ని ఉన్నట్టుండి మూగనోము పట్టాను. ఇప్పుడు తలచుకుంటే నవ్వొస్తుంది కానీ అప్పటికి నాకు అవి ప్రపంచ సమస్యలు. ఆ పెళ్ళి ఫొటోల్లో అవ్వ గారి చీర వెనకాలో, గ్రూపు ఫొటోల్లో నలుగురి చాటునో దాక్కుని ఉన్నానంటే ఉన్నాను అనిపించా...

అప్పుడొచ్చింది యవ్వనం ... బంతిపూల రథంలో. జీవితంలో ఎన్ని పెళ్లిళ్లకు చూసినా, ఎందరి తరపున ఎన్ని వరుసల్లో వెళ్లినా "పెళ్లికూతురు చెల్లి" అనే హోదా ఉంది చూసారూ దానికి మించిన హోదా ఇంకోటి ఉండదు గాక ఉండదు. పూలవనం లాగా పందిట్లో పెళ్లికూతురు చెల్లి గారు తిరుగుతూ ఉంటే కళ్యాణ మండపం అంతా కూడా తను ఎటు వైపు తిరిగితే అటువైపు తిరుగుతుందంటే నమ్మాలి మరి. పెళ్లీడు కొడుకులు ఉండే వరసకి అత్తల మురిపెపు చూపులు, పెళ్ళికొడుకు వైపు వారి చూసీ చూడని బేరీజు చూపులు, పెళ్ళికి తరలి వచ్చిన అబ్బాయిల కన్నుల రాయబారాలు, అమ్మమ్మ నాయనమ్మల మురిపాలు, అత్తల పిన్నుల పన్నీటి జల్లులలాంటి పొగడ్తలు ఇన్నిటినీ ఒకవైపు సంబాళిస్తూ, అలవాటు లేని చీరని అలంకారాలనీ ఇంకో వైపు వయ్యారంగా సవరించుకుంటూ, పువ్వులు అందించుట పసుపూ గంధం పంచుట వంటి నాజూకు పనులు చేస్తూ పెళ్లిసందడంతా తానై తిరిగే అవకాశం ఒక్క పెళ్లి కూతురు చెల్లికి మాత్రమే చెల్లుతుంది. తన కోసం ప్రత్యేకంగా కొన్ని అదృశ్య శక్తులు పనిచేస్తూ ఉంటాయి. నిమిషాల మీద ఆజ్ఞలు చెల్లుబాటైపోతాయి. భోజనాలలో మారు వడ్డనలు, కొసరు వడ్డనలు అడక్కుండానే జరిగిపోతాయి. అదొక భోగం. ఎన్ని ఊసులు, ఎన్నేసి విన్నపాలు, ఎన్నెన్ని వేడుకోళ్ళు! చూసీ చూడనట్టు, గుర్తించీ గుర్తించనట్టు జడ కుచ్చులతో ఆడుకుంటూనో, గాజులు సరిచూసుకుంటూనో చిన్ని నవ్వురువ్వితే  చాలు కదూ! గట్టి మేళం అనగానే వధూ వరులపైన పడే అక్షింతలకన్నా ఎక్కువే పడతాయి పెళ్లికూతురు చెల్లిపైన...అభినందనల వరాల జల్లులు. నన్ను మధ్యలో కూర్చో పెట్టి అటూ ఇటూ అక్కా బావ కూర్చుని ముచ్చటగా తీయించుకున్న ఫోటో మదిలో మెదిలింది ఒక్క క్షణం.

తరువాయి కళ్యాణం నాదే. పట్టరాని సంతోషం, చెప్పలేని గుబులు, ఎవరో తరుముకొని వస్తున్న భావన కలగలిపి ఉక్కిరిబిక్కిరి చేసేవి. పెళ్లికూతురి పెదవులపైని చిరునవ్వు రహస్యం వీడిపోయింది. పీటలపై కూర్చున్న కన్నె బంగారులందరికీ తెలిసిన రహస్యమే కదూ! జ్వరంలాంటి ఉద్వేగంలో ఏమి జరుగుతుందో తెలిసేలోగా ఏదో కలలోలాగా జరిగిపోతుంది పెళ్లి. అయినా, వేద మంత్రాల సాక్షిగా నాన్న కన్యాదానం చేసిన క్షణాలు మాత్రం ఎన్నటికీ మరచిపోలేము. అప్పటి మొదలు అంతవరకూ ఎరుగని పెద్దరికం ఏదో భుజాన పడ్డట్టుగా అనిపిస్తుంది. చిన్నతనాలకి, చిలిపితనాలకీ, ముచ్చట్లకీ, మురిపాలకీ అంతటితో ఇక సెలవు. ఇహ ప్రవాస కాపురాలకి వచ్చే పూర్ణమ్మలకి మరీను. జీవితం సరదా తీర్చేస్తుంది ఇక్కడ. కాపురానికి వెళ్లే ముందు  నేనూ అమ్మా మల్లె పందిరి ముందు తీసుకున్న ఫోటో కళ్ళముందు మెదిలింది. తెలియకుండా ఒక ఘాడమైన నిట్టూర్పు విడిచాను. నా పక్కలో దూరుకుని దూరుకుని బజ్జున్న పిల్లదాన్ని ఒకసారి ముద్దాడి ఈస్ట్ మన్ కలర్ నుండి బ్లాక్ వైట్ వరకూ సాగిన ఆలోచనలకు తెరదింపేసి పడుకున్నాను.

తెల్లారి అలారం మోగగానే లేచి పెళ్లి లైవ్ స్ట్రీమింగ్ కి కనెక్ట్ అయ్యి కూర్చున్నా. మొదలయ్యింది హడావిడి ఇక. అదుగో పెళ్ళికొడుకు వాళ్ళు వచ్చారు. మా అత్తలు, పిన్నులూ, పెద్దమ్మలూ అంతా ఎదుర్కోలు వెళ్లి మగ పెళ్ళివారిని మండపంలోకి తీస్కుని వస్తున్నారు. రిసెప్షన్ మొదలయ్యింది. ఇటు వైపు వారు అటు వైపు వారు అంతా పలకరించుకుంటూ ఉన్నారు. తనవారిని పెళ్లికొడుక్కి పరిచయం చేస్తోంది పెళ్లికూతురు. వాళ్ళ తరఫువాళ్ళు వస్తే బంధుత్వాలు వివరిస్తున్నాడు పెళ్ళికొడుకు. ఊహల్లో అక్కడికి వెళ్లొచ్చి పలకరించి వచ్చేసా. ఇంట్లో పనులు చేసుకుంటూనే కానిచ్చేస్తున్నా 'వర్క్ ఫ్రొం హోమ్' లాగా.

ఇహ భోజనాలు అయ్యాక మొదలయ్యింది 'వక్కాకు శాస్త్రం'. అందంగా తమలపాకులు పేర్చిన పళ్లెంలో పెళ్లికూతురు వైపు ఆడపడుచులందరి గుప్పిళ్ళకి సరిపోను వక్కలు పెళ్ళికొడుకు మేనమామలు ఇవ్వాల్సిందే. సరిపోలేదని ఆటపట్టించే ఆడపెళ్ళివారు. మీరు తప్పు ఆడారని మగపెళ్లి వారు సరదాగా వాదులాడుకుంటున్నారు. చేతి గాజులు ఎగదోసుకుని నేను కూడా వక్కలు తీయాల్సింది కదూ!

ఇక నలుగు అయ్యాక ముహూర్తం మొదలయ్యే సరికల్లా బుడ్డదాన్ని తీసుకు వచ్చి ఒళ్ళోపెట్టుకుని అన్ని ఘట్టాలు చెపుతూ చూపిస్తూ ఉన్నాను. "హూ ఈస్ థిస్ ప్రిన్సెస్ అమ్మా ?" అంది. నన్ను నేను చూసుకున్నట్లు అనిపించి దాని ముద్దులతో ముంచేసా. ఈ సారి ఇంట్లో జరిగే పెళ్ళికి తప్పకుండా బుడ్డదాన్ని తీసుకుని వెళ్ళాలి అనుకున్నా.

అది అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెపుతూ అదిగో అక్కడ ఉన్నది మీ పెద్ద తాత, ఇక్కడ మీ చిన్నతాత, అక్కడ నిద్రకి తూలుతూ సన్నాయి మేళానికి ఉల్లిక్కిపడేది మీ నాయనమ్మ చెల్లెలు, వక్కాకు దంచుకుంటూ చుట్టూ ఉన్న తన నేస్తాలకి పంచుకుంటూ తాను కొంచం తింటోందే అది మీ జేజవ్వ అని వివరాలు చెప్తూ ఉంటే ఆశ్చర్యపోతూ వింటోంది. పెళ్లి అయిపోయింది, అరుంధతీ నక్షత్రం చూస్తున్నారు వధూవరులు. ప్రతి తంతూ విసుగూ విరామం లేకుండా పంతులుగారి కోసం ఒకసారి, ఫోటోలవారి కోసం ఒకసారి చేస్తున్నారు కొత్త జంట.

ఎటు చూసినా సందడి సందడిగా ఉంది. ఒకరిని ఒకరు పలకరించుకుంటూ, వివరాలు తెలుసుకుంటూ, నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లాడుకుంటున్నారు. అందరి కళ్ళలో ఒక తళుకు...తమ తమ వారిని చూసుకుంటున్నందుకేమో! ఇంత సందడిలో ఎవరైనా అక్కడ ఒక్కసారి నను తలచుకుని ఉంటారా? నా వాళ్లందరినీ ఒక్క చోట చూసిన నా ఆనందం వారికి తెలుస్తుందా? అనుకుంటూ చూద్దును కదా నా ఒడిలో పిల్ల బజ్జునేసింది. కాల చక్రం మళ్ళీ మొదటికి వచ్చి తిరగడానికి సిద్ధపడుతోంది .

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments